## క్లుప్తంగా

### కార్తీక మాస పూజల్లో రోజా



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : నేత్ర ప్రదాయణి దేశమ్మ దేవత కార్తీక మాస పూజల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. ఆలయానికి శనివారం వెళ్లిన ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు వేణుబాబు, దయానిధి, కౌన్సిలర్ ఇంద్రయ్య, కో–ఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, నాయకులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### భూమన ప్రమాణ స్వీకారానికి తరలిరండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెదురుకుప్పం : వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి ఆదివారం తిరుపతిలో ప్రమాణ స్వీకారం చేయనున్నారని, ప్రతి ఒక్కరూ తరలి రావాలని జెడ్పీటీసీ సుకుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ కార్పొరేషన్ల మాజీ అధ్యక్షులు, డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, యువత మండల అధ్యక్షుడు గణపతిరెడ్డి, నాయకులు మునికృష్ణారెడ్డి, విజయశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

### వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు

కార్వేటినగరం: మండలంలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన కృష్ణమూర్తి, శ్రీదేవి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ముందుగా వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకొచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శుక్రవారం, శనివారాలే కాకుండా రోజూ నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకోవాలని కోరారు.

### అన్బలగన్‌కు మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ



అన్బలగన్‌తో మాట్లాడుతున్న నారాయణస్వామి

పాలసముద్రం : కంటిపొర ఆపరేషన్ చేసుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జెడ్పీటీసీ అన్బలగన్‌ను శనివారం మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తులసి యాదవ్, సర్పంచ్ జీ మహేష్, అయ్యప్ప, పుత్తూరు కేశవరెడ్డి, చినబ్బరాజు, గణేష్‌రెడ్డి, రవిరెడ్డి, పయణి, ధనుంజయరెడ్డి, పద్మనాభనాయుడు, మురుగేష్, కుట్టి, గోపాల్, లక్ష్మణన్, షణ్ముగరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

### బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

శ్రీరంగరాజపురం : మండలంలోని చిన్నబావనపల్లిలో బెల్టుషాపు నిర్వహిస్తున్న బుసిరెడ్డిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సుమన్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు గ్రామంలో శనివారం దాడి చేశామన్నారు. 30 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని బుసిరెడ్డిని అరెస్టు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తున్నా, సారాయి విక్రయాలు చేస్తున్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

### నోట్ పుస్తకాల పంపిణీ



విజయపురం : మండలంలోని మిట్టకండ్రిగ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు మంచి చదువుతో పాటు, క్రమ శిక్షణ కలిగి నడుచుకోవాలన్నారు. హెచ్‌ఎం దివ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మా ఇంటి దీపాన్ని ఆర్పేశాడు



విలపిస్తున్న చిన్నారి తల్లి

దీపావళి రోజే మా ఇంటి దీపాన్ని ఆర్పేశాడు దుర్మార్గుడు. శుక్రవారం నాడు దేశమంతా మహాలక్ష్మికి పూజలు చేస్తుంటే మా ఇంటి మహాలక్ష్మి గొంతు నొక్కేశాడంటూ చిన్నారి తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించారు. ఆర్థిక లావాదేవీలు ఉన్న వారు, అయినవాళ్లు, స్నేహితులు ఇలా తెలిసినవారే ఆడబిడ్డల పాలిట కాలయములవుతుంటే ఎవరిని నమ్మాలో తెలియక ఆడబిడ్డల తల్లిదండ్రులు మధనపడుతున్నారు. మత్తు పదార్థాలు మనుషుల్ని మృగాలకంటే హీనంగా మార్చేస్తుంటే జరిగే ఈ అరణ్యకాండకు అంతమెప్పుడని ప్రశ్నిస్తున్నారు. కలహాల్లేని గ్రామంలో ఓ చీడ పురుగులా చేరాడని స్థానికులు మండిపడుతున్నారు. కళ్లముందు ఆడుతూ తిరిగిన చిన్నారి, కానరాని లోకాలకు వెళ్లిపోయిందంటే నమ్మలేక పోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

- అక్కున చేర్చుకున్న పాపానికి శాపంగా మారాడు
- గ్రామానికే మాయనిమచ్చగా మిగిలాడు
- ఆడపిల్లల తల్లిదండ్రులు ఎవరిని నమ్మాలి?
- విషాదంలో ఏఎం పురం

విజయపురం (వడమాలపేట) : వడమాలపేట మండలం, ఏఎం పురం గ్రామానికి చెందిన యువతికి కేవీబీ పురం మండలం ఓకూరుకు చెందిన యువకుడితో ఆరేళ్లక్రితం వివాహమైంది. వీరికి మూడున్నరేళ్ల కుమార్తె, ఏడాది వయసున్న కుమారుడు ఉన్నారు. పదిరోజుల క్రితం కూలిపనుల నిమిత్తం భర్త, పిల్లలతో ఏఎం పురం ఎస్టీ కాలనీకి వీరు రాగా, మూడున్నరేళ్ల చిన్నారిని ఆటవికంగా చంపేసిన సంఘటన ఆ గ్రామానికే మాయని మచ్చగా మిగిలింది. మానవత్వం ఉన్న ప్రతి హృదయాన్ని ఈ సంఘటన కలిచివేసింది. ఆ గ్రామంలో ఏ తలుపు తట్టినా ఈ కన్నీటి గాథే వినిపిస్తోంది. మొన్నటి వరకు వీధిలో ఆడుకుంటూ తిరిగిన పాపను, దీపావళి చిచ్చుబుడ్డీలు కాల్చుతుంటే చిందులు వేసిన చిన్నారిని తాము కళ్లారా చూశామని పండగ ముగియక మునుపే చిన్నారి జీవితం ముగిసిపోయిందని తలచుకుంటేనే బాధను తట్టుకోలేకపోతున్నామని గ్రామస్తులు కన్నీరు మున్నీరవుతున్నారు. నిందితుడు సుశాంత్ కన్నతల్లి చిన్నతనంలోనే చనిపోయింది. తండ్రి బాధ్యతలు మరచి దూరప్రాంతాలకు వెళ్లిపోయాడు. పెదనాన్నా, పెద్దమ్మ సుశాంత్‌ను పెంచి పెద్ద చేశారు. అయితే అతని నడవడిక నచ్చక తరిమేశారు. అలాంటి సుశాంత్‌ను చేరదీయడమే చిన్నారి తల్లిదండ్రులు చేసిన తప్పయింది. ఆ ఇంటి దీపాన్ని ఆర్పేసింది. ఇలాంటి రాక్షసునికి గ్రామంలో తమ కళ్ల ఎదుటే ఉరిశిక్ష వేయాలని, మరెక్కడా ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఆస్పత్రి వద్ద దిగాలుగా వేచి చూస్తున్న గ్రామస్తులు



గ్రామంలో భద్రతకు వచ్చిన పోలీసులు

**గ్రామంలో పోలీసు గస్తీ**

గ్రామంలో అత్యంత బాధాకరమైన సంఘటన చోటుచేసుకోవడంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేసే ఆస్కారం ఉంటుందేమో అన్న ఆలోచనతో శాంతిభద్రతల కోసం గ్రామంలో పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామంలోని అరుగులపై ఉంటూ పర్యవేక్షించారు.

**ప్రాణస్నేహితుడే కాలయముడు**

చిన్నారికి మేనమామ అయిన హరికృష్ణకు ప్రాణ స్నేహితుడే సుశాంత్. ఒకే గ్రామానికి చెందిన వారు కావడం సమీప గృహస్తులే కావడంతో వీరిద్దరూ చిన్నప్పటి నుంచి కలిసే తిరిగారు. ఇద్దరూ గతంలో బెంగళూరులోని ప్లాస్టిక్ గ్లాస్ తయారుచేసే కంపెనీలో పనిచేసేవారు. ప్రస్తుతం ఎక్కడ ఏ పని దొరికినా అక్కడకు వెళ్లి ఆ కూలి పనులు చేస్తున్నారు. దీపావళి పండుగకు అత్తగారింటికి వచ్చిన చిన్నారి తండ్రి మధు, హరికృష్ణ, సుశాంత్ కలిసి శుక్రవారం ఉదయం ఒక ఇంటి మోల్డింగ్ పనులకు కూలీలుగా వెళ్లారు. వచ్చిన డబ్బులతో మధ్యాహ్నం మద్యం తాగారు. ఇలా వారి పంచనే ఉన్న సుశాంత్ అతిగా మద్యం తాగి అదను చూసి పైశాచికంగా చిన్నారిని బురదకాలువలో పూడ్చిపెట్టి పొట్టనపెట్టుకున్నాడు. మద్యం మత్తులో ఇంతటి అఘాయిత్యం చేసేందుకు ఆస్కారం ఉండదని గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటైనపుడే ఈ స్థాయి ఘోరాలు చేస్తారని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

**అయినవారే అక్కున చేర్చుకోలేదు**

తల్లిదండ్రులు లేరని చిన్నతనం నుంచి పెంచిన పెదతండ్రి, పెదతల్లినే సుశాంత్ గౌరవించేవాడు కాదు. తాగిన మత్తులో వచ్చి నానాయావ చేసేవాడు. సంపాదించిన డబ్బులు పైసా కూడా ఇంటికి ఇచ్చేవాడు కాదు. పెద తండ్రి, పెద తల్లి మరణంతో ఇతని గురించి తెలిసిన అయిన వాళ్లు ఎవరూ ఇతన్ని చేరదీయలేదు.

**వివరాల నమోదులో సచివాలయ సిబ్బంది**

సంఘటనకు సంబంధించి వివరాల నమోదుకు సచివాలయ సిబ్బంది గ్రామంలో పర్యటించారు. చిన్నారి ఉన్న ఇల్లు, నిందితుడు ఉన్న ఇల్లు, ఇరుగు పొరుగుల ఇళ్లకు వెళ్లి సంఘటనకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకున్నారు. నివాసాల ఫొటోలు తీసుకున్నారు.

**ఓకూరులో చిన్నారికి అంత్యక్రియలు**

చిన్నారి తండ్రి స్వగ్రామం సత్యవేడు నియోజకవర్గం కేవీబీపురం మండలం ఓకూరు కావడంతో చిన్నారి అంత్యక్రియలు అక్కడే నిర్వహించనున్నారు. దీంతో చిన్నారి మృతదేహాన్ని ఓకూరులోని నివాసానికి తరలించారు.

**సాయంత్రం తీసుకెళ్లగా చూశా**



చిన్నారి ఉన్న ఇంటికి పక్కనే మా ఇల్లు. సుశాంత్ ఇంటి నుంచి చిన్నారిని తీసుకెళుతుండగా చూశాను. అయితే తిరిగి వచ్చేసమయంలో అతను ఒంటరిగా వచ్చాడు. చిన్నారి గురించి అడిగితే తటపటాయించాడు తప్పించుకునే ప్రయత్నం చేశాడు. మేము పట్టుకొని పోలీసులకు చెప్పాం. ఇలాంటి విషాదకరమైన సంఘటన గ్రామంలో ఎప్పుడూ జరగలేదు. నమ్మకంగా ఉంటూ గొంతుకోశాడు. పసికందును పొట్టన పెట్టుకున్నాడు.

– అలేఖ్య, ఏఎం పురం ఎస్టీకాలనీ

**నమ్మించి మోసం చేశాడు**



నా కళ్లముందే ఇంటి నుంచి మనవరాల్ని ఏదైనా కొనిస్తా అని అంగడికి తీసుకెళ్లాడు. నా కుమారునికి మంచి స్నేహితుడే కదా అని అతనిపై నమ్మకంతోనే పంపించాం. నవ్వుతూ అతనితో వెళ్లిన మనవరాలిని మళ్లీ శవంగా చూస్తానని ఊహించలేదు. ఇలాంటి నరహంతకులకు ఉరిశిక్ష వేయాలి. మరో చిన్నారి ఇలాంటి దుర్ఘటనలో బలికాకూడదు.

– మొగిలమ్మ, చిన్నారి అవ్వ, ఏఎం పురం ఎస్టీకాలనీ

## కరువు మండలంగా ప్రకటించాలి

బంగారుపాళెం: మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం మాట్లాడుతూ, ప్రభుత్వం ఇటీవల జిల్లాలో కరువు మండలాలను ప్రకటించిందన్నారు. జిల్లాలో అతిపెద్ద మండలంగా బంగారుపాళెం ఉందన్నారు. 41 గ్రామ పంచాయతీలు, 180 గ్రామాలు ఉన్నాయన్నారు. మండలంలో చాలా మంది రైతులు వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయం చేయడం ఇబ్బందిగా మారిందన్నారు. ఈ ఏడాది సగటు వర్షపాతం అంతంత మాత్రమేనన్నారు. గత ఏడాది కురిసిన వర్షాలకు చెరువుల్లో నీరు చేరిందన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు మండలంలో వంకలు వాగులు కూడా సాగలేదని గుర్తుచేశారు. రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడిన దాఖలాలు కనిపించడంలేదన్నారు. రైతులు అన్ని విధాలా నష్టపోతున్నారని పేర్కొన్నారు. సాగుకు పెట్టిన ఖర్చు కూడా అందడం లేదని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం బంగారుపాళెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ఆదుకోవాలని కోరారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



ఆర్కేవీబీ పేట వేరుశనగ పంటను పరిశీలిస్తున్న రాస్ కేవీకే శాస్త్రవేతలు

కార్వేటినగరం: వేరుశనగ పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని రాస్ కేవీకే శాస్త్రవేత డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం ఆర్కేవీబీపేట, రాజుల కండ్రిగ, కేశవకుప్పం గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ట్యాగ్ 73 వేరుశనగ పంట ప్రధాన తెగుళ్లను తట్టుకుని హెక్టారుకు ఖరీఫ్‌లో 20 నుంచి 25, రబీలో 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలు అందించే స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. అలాగే వివిధ రకాల పంటలను పరిశీలించి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేతలు డాక్టర్ దివ్య, రామకుమార్, చంద్రమౌళిరెడ్డి, దామురాజు, చిరంజీవి, ప్రసాద్, హరి, మాధవ పాల్గొన్నారు.

### పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలి



గర్భిణులు, బాలింతల రికార్డులను పరిశీలిస్తున్న జార్జ్

పాలసముద్రం : ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులకు సకాలంలో టీకాలు వేయాలని జిల్లా గణాంక అధికారి జార్జ్, పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. వారు శనివారం మండల పరిధిలోని క్రిష్ణజమ్మాపురంలో పర్యటించారు. సచివాలయ పరిధిలో గర్భిణులు, చిన్నారులకు వేస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ పిల్లలకు ఐఎఫ్‌ఏ, విటమిన్–ఎ సిరప్ వేయాలన్నారు. సూపర్‌వైజర్ సుశీల, మురళి, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బాలికలకు రక్షణ కరువు



కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో బాలికలు, మహిళలకు రక్షణ కరువైందని, ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట అఘాయిత్యాలు, అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు ఇన్‌చార్జి, రాష్ట్ర మహిళా నాయకురాలు కలత్తూరు కృపాలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా వడమాలపేటలో మూడేళ్ల చిన్నారిపై మానవ మృగం అత్యాచారం చేసి హత్య చేయడం హేయమైన చర్య అని వాపోయారు. ఇందుకు పోలీసులు, ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపించారు. రాష్ట్రంలో నిత్యం ఏదో ఒకచోట అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన దిశా చట్టం, దిశా యాప్‌ను నిర్వీర్యం చేయడంపై ఉన్న శ్రద్ధ మహిళల రక్షణపై లేదన్నారు. రాష్ట్రం అత్యాచార ఆంధ్రప్రదేశ్‌గా మారిందని విమర్శించారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర హోమ్ మంత్రిగా ఉన్న అనిత కళ్లు మూసుకుందా అని నిలదీశారు. చిన్నారిపై లైంగిక దాడి చేసి హత్య చేసిన నిందితుడిని అరెస్టుచేసి బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య




మాట్లాడుతున్న ప్రిన్సిపల్ హేమలత

పాలసముద్రం : ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఉచితంగా అందిస్తున్నామని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. ఆమె శనివారం గతంలో కళాశాలలో చదివి చంద్రగిరి సమీపంలోని విద్యానికేతన్ బీటెక్‌లో ఉచితంగా సీట్లు సాధించిన విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులే ఎక్కువ మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. కష్టపడి చదివితే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో అర్హత, అనుభవం ఉన్న అధ్యాపకులతో బోధన అందిస్తున్నట్లు వివరించారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అధ్యాపకులు సూరి, వినాయకం పాల్గొన్నారు.

### తమిళగ వెట్రి కళగం పార్టీ జెండా ఆవిష్కరణ



టీవీకే పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న సినీ నటుడు విజయ్ అభిమానులు

గంగాధర నెల్లూరు: మండలంలోని అగ్రహారం దళితవాడలో శనివారం తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ జెండా ఆవిష్కరించారు. తమిళనాడుకు చెందిన ప్రముఖ సినీ నటుడు విజయ్ ఇటీవల తమిళగ వెట్రి కలగం పార్టీని ప్రారంభించిన విషయం తెలిసిందే. రాబోయే ఎన్నికల్లో ఈ పార్టీ బరిలోకి దిగనుంది. ఈ పార్టీ జెండాను, అజెండాను ఇప్పటికే అధినేత విజయ్ ప్రకటించారు. క్షేత్ర స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని తన అభిమానులకు పిలుపునిచ్చారు. అందులో భాగంగా తమిళనాడు రాష్ట్రం వేలూరు, కాట్పాడి మావట్టం తమిళగం వెట్రి కలగం పార్టీకి చెందిన నేతలు వేలు మురుగన్, రాజశేఖర్, లివింక్, కామరాజ్, రఘు, ఆ పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు శరవణ అధ్యక్షతన అగ్రహారం దళితవాడకు చెందిన గాంధీ, నరేంద్రకుమార్, రంజన్, అల్లి, సాయి, ఉదయ్, అప్పు, సునీల్ తమిళగ వెట్రి కలగం పార్టీలో చేరారు.

## ఆదాయమున్నా వసతులు కరువు

వారపు సంతల్లో వసతులు కరువయ్యాయి. సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఏటా వేలం పాటల ద్వారా రూ.లక్షల ఆదాయం వస్తున్నా వసతుల గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. చిన్నపాటి వర్షానికే కూరగాయలు కొట్టుకుపోతున్నాయి. బురదలో మునిగిపోతున్నాయి. కూరగాయల విక్రయానికి సరైన షెడ్లు లేక వ్యాపారులు, అడుగు పెట్టేందుకు కూడా వీలుకాకపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంతల్లో వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

- సంతలో పేరుకుపోయిన సమస్యలు
- చిన్నపాటి వర్షానికే తడిచి ముద్దవుతున్న వస్తువులు
- లబోదిబోమంటున్న వ్యాపారులు, వినియోగదారులు
- పట్టించుకోని పంచాయతీల అధికారులు



దేవళంపేటలో వీధిలో విక్రయిస్తున్న వ్యాపారస్తులు (ఫైల్)

వెదురుకుప్పం : మండలంలో ప్రధానంగా పచ్చికాపల్లం, వెదురుకుప్పం, మొరవ, దేవళంపేట ప్రాంతాల్లో వారపు సంతలు జరుగుతుంటాయి. వాటికి ప్రతి ఏటా వేలం పాటలు నిర్వహించడం ద్వారా రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. అధికారుల నిర్లక్ష్యం వినియోగదారులు, వ్యాపారులకు శాపంగా మారింది. వర్షం వస్తే నీరు పెద్ద ఎత్తున నిలిచిపోయి మడుగులను తలపిస్తుండడంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో వెదురుకుప్పం, పచ్చికాపల్లం, మొరవ, దేవళంపేట ప్రాంతాల్లో జరిగే వారపు సంతల్లో సరైన షెడ్లు లేవు. దీంతో చినుకు పడితే చాలు సరుకులు తడిసి ముద్దవుతున్నాయి.

- వెదురుకుప్పంలో ప్రతి మంగళవారం వారపు సంత పెద్ద ఎత్తున జరుగుతుంది. ఇక్కడ అధికారులే నగదు వసూలు చేస్తున్నారు. ఇటీవల ఓ మంగళవారం సాయంత్రం మండల వ్యాప్తంగా మోస్తరు వర్షం పడింది. వెదురుకుప్పంలో జరిగే సంతలో వర్షపు నీరు ప్రవహించడంతో కూరగాయలు, సరుకులు కొట్టుకుపోయాయి. రోడ్డుపైనే విక్రయాలు చేస్తుండడంతో ఎండలకు సరుకులు వాడిపోతున్నాయి. దుమ్మూధూళితో కలుషితం అవుతున్నట్లు వినియోగదారులు పేర్కొంటున్నారు.
- దేవళంపేటలో ప్రతి శుక్రవారమూ వారపు సంత జరుగుతుంది. ఇక్కడ వ్యాపారులకు నీడ కల్పించలేదు. దీంతో దేవళంపేటలోని తిరుపతి ప్రధాన రహదారి పక్కన ఓ వీధికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటుచేసుకుని విక్రయాలు చేపడుతున్నారు. ఇక్కడ కనీస వసతులు లేవు. ఆరుబయటనే సంత జరుగుతోంది. వర్షం వస్తే కూరగాయలు, నిత్యావసర వస్తువులు తడసి ముద్దవుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు.
- పచ్చికాపల్లం, మొరవ ప్రాంతాల్లో మార్కెట్ యార్డులు లేవు. రోడ్లపైనే వారపు సంతలను నిర్వహిస్తుండడంతో వ్యాపారులతోపాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీరు కూడా అందుబాటులో లేదు. అత్యవసర సమయంలో అంతే సంగతులు. ఇక్కడికి మండలం నుంచే కాకుండా పెనుమూరు, కార్వేటినగరం ప్రాంతాల నుంచి చిరువ్యాపారులు సరుకులను తెచ్చి విక్రయిస్తుంటారు. పచ్చికాపల్లంలో ఆదివారం జరిగే సంతకు దాదాపు 50 గ్రామాల నుంచి ప్రజలు వచ్చి సరుకులను కొనుగోలు చేస్తుంటారు. రోడ్డుపై నిర్వహిస్తుండడంతో గతంలో ఎంపీడీవో ఆదెం రాజశేఖర్‌రెడ్డి వారపు సంతను వేరే చోటికి మార్చినా మళ్లీ మొదటికొచ్చింది. రోడ్లపైనే కూరగాయల విక్రయాలు జరుగుతుండడంతో వాహనాల రాకపోకల ద్వారా వచ్చే దుమ్ముధూళితో ఆహార పదార్థాలు కలుషితమవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సంత జరిగే ప్రాంతాలు శుభ్రంగా లేకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వారపు సంతల్లో వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## కరకంతేశ్వర స్కందషష్టి ఉత్సవాలు ప్రారంభం



పుష్పాలంకరణలో శ్రీవళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యా స్వామి

నగరి : పట్టణ పరిధి కరకంతేశ్వర స్వామి ఆలయంలో స్కందషష్ఠి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం గణపతి పూజ, వల్లిదేవసేనా సమేత సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. స్వాములకు పుష్పాలంకరణ చేసి, ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల దర్శనార్థం ఆలయ మండపం వద్ద ఉంచారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. షష్ఠి హారతి పూజలు, ఊంజల్ సేవ నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఉభయదారులకు ఆలయ మర్యాదలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా వారికి ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 7న సూర సంహారం, 8న కల్యాణోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు.